క్లుప్తంగా

గుంతల పూడ్చివేత



జనగామ రూరల్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వడ్లకొండ–నర్మెట, తరిగొప్పులకు వెళ్లే రూట్‌లో బ్రిడ్జి నిర్మాణం వద్ద రోడ్డు గుంతలమయమై వాహనదారులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని డీసీపీ రాజమహేంద్ర నాయక్ గుర్తించి రోడ్డుపై కంకర, మట్టి పోయించి గుంతలను పూడ్చివేయించారు. ఏసీపీ పార్థసారథి, ఎస్సై తిరుపతి ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

జనగామ రూరల్: క్రీడా రంగానికి బడ్జెట్‌లో రూ.325 కోట్లు ప్రభుత్వం కేటాయించడం హర్షణీయమని జిల్లా అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు గంగిశెట్టి మనోజ్‌కుమార్, శాంసన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం క్రీడా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని మినీ స్టేడియంలోని ఆడిటోరియంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. సుగుణాకర్, రాంప్రసాద్, మల్లయ్య, శేఖర్, ఆశోక్, రవి, హరీష్ పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జనగామ రూరల్: వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ఏసీ రెడ్డి వర్ధంతి సభను విజయవంతం చేయాలని సీపీఎం పట్టణ కార్య దర్శి జోగు ప్రకాశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏసీరెడ్డి స్ఫూర్తితో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. ఈనెల 28వ తేదీన జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం కామాక్షి ఫంక్షన్ హాల్‌లో ఏసీరెడ్డి వర్ధంతి సభ జరుగుతుందని తెలిపారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ, ఈజీఎస్ రాష్ట్ర డైరెక్టర్ అందె యాకయ్య రాజీనామా చేసాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీకి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోసం విధేయతగా పనిచేసినా తన సేవలకు గుర్తింపు ఇవ్వలేదని, కాంట్రాక్టర్లు, పెట్టుబడిదారులు, అగ్రకుల పెత్తందారులకే పార్టీలో గుర్తింపు ఇచ్చారని ఆరోపించారు. ఈ తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో చేపడుతున్న ప్రజాపాలన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిల సారథ్యంలో ప్రజాసేవలో కొనసాగాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు తన రాజీనామాను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడికి పంపినట్లు చెప్పారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్‌టీయూ ధ్యేయం

జనగామ రూరల్: ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్‌టీయూ ధ్యేయమని సంఘం అధ్యక్షుడు కోల్ల మహిపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలో చేపట్టిన పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూకల ఎల్లారెడ్డి, శ్రీనివాస్, జలీల్, దుర్గాప్రసాద్, పల్లారెడ్డి,నరేందర్, రమేష్ పాల్గొన్నారు.

హాస్టళ్లలో ఎస్టీ విద్యార్థులకు సీట్లు కల్పించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ, బీసీ బాలుర, బాలికల హాస్టళ్లలో ఎస్టీ విద్యార్థులకు సీట్లు కల్పించాలని బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లకావత్ చిరంజీవినాయక్ కోరారు. ఈ మేరకు బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, ఘన్‌పూర్ ఆర్డీఓ డీఎస్ వెంకన్నకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు బొంకూరి మహేష్, విద్యార్థులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

జఫర్‌గఢ్: మండలంలోని తమ్మడపల్లి(జి) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తల్లిదండ్రులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కాగా, ఉపాధ్యాయులను నియమించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. గుండెబోయిన సతీష్, చిలువేరు నాగేష్, కొంతం యాదగిరి, పులిగిల్ల నాగరాజు, గాదె ఉపేందర్, నాయిని రామస్వామి తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

చిల్పూరు: మండలంలోని నష్కల్ గ్రామంలో గుండెబోని రాజుకు చెందిన పాడి గేదె విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందింది. బాధితు తెలిపిన వివరాలు.. రోజు మాదిరిగా వ్యవసాయ పొలంలో గేదెను మేతకు వదిలాడు. అదే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్‌వైరు తెగి పొలంలో పడింది. దీంతో గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. బాధిత రైతును ఆదుకోవాలని మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు కర్ణకంటి స్వప్నవెంకటేష్, పాశం శిరీషసురేష్ అధికారులను కోరారు.

ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌కు స్థల పరిశీలన

- దసరాలోపు శంకుస్థాపన చేస్తాం
- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్థలం వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పక్కన అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

స్టేషన్‌ఘన్‌పూర్: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన స్టేషన్ ఘన్‌పూర్‌లో సమీకృత రెవెన్యూ డివిజన్ కార్యాలయాల సముదాయం నిర్మాణానికి దసరా పండుగలోపు శంకుస్థాపన చేసేలా కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్‌లో సమీకృత రెవెన్యూ డివిజన్ కార్యాలయాల భవన సముదాయం నిర్మాణం కోసం ఎమ్మెల్యే కడియం శ్రీహరి అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి శుక్రవారం ఘన్‌పూర్‌లో ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. స్థానిక రైతు వేదిక పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని, మండల పరిషత్ కార్యాలయం వెనుకవైపు ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆయన రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులతో కలిసి పరిశీలించి వారికి సూచనలు చేశారు. పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి సమీకృత రెవెన్యూ డివిజన్ కార్యాలయాల సముదాయం నిర్మాణం కోసం మూడు రోజుల్లో సమగ్ర మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. జీ ప్లస్ మోడల్‌లో రెండు అంతస్తుల భవనంలో 20 కార్యాలయాలు వచ్చేలా నిర్మాణం, పార్కింగ్, చుట్టూరా ఖాళీ ప్రదేశం, గ్రీనరీ తదితర సౌకర్యాలతో అన్ని హంగులతో నిర్మాణం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఆర్డీఓ డీఎస్ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మధుసూదన్, కాంగ్రెస్ నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, రాపోలు మధుసూదన్‌రెడ్డి, చింత ఎల్లయ్య, సింగపురం వెంకటయ్య, గన్ను నర్సింహులు,, రజాక్‌యాదవ్, బూర్ల శంకర్ అధికారులు పాల్గొన్నారు.

రుణమాఫీ బాధ్యత నాదే..

చిల్పూరు: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ వారం రోజుల్లో అయ్యేలా చూస్తానని, ఒక వేళ కాకుంటే నాదే బాధ్యత అని రైతులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. మండలంలోని మల్కాపూర్ ఇండియన్ బ్యాంకు పరిధిలోని 8 గ్రామాల్లోని అర్హులైన రైతులకు రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకు వద్దకు శుక్రవారం చేరుకున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యేకు నాయకులు విషయాన్ని తెలిపారు. వెంటనే ఏడీఏ వినోద్‌కుమార్, తహసీల్దార్ సరస్వతి, ఆర్‌ఐ శ్రీనివాస్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీధర్‌తో కలిసి ఎమ్మెల్యే బ్యాంకుకు చేరుకొని రైతులను పిలిచి ఖాతాలను పరిశీలించారు. రుణమాఫీ జరగలేదని గుర్తించి వెంటనే వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావుతో ఫోన్‌లో మాట్లాడారు. త్వరలో రుణమాఫీ వర్తిస్తుందని తెలుపడంతో రైతులు బ్యాంకు వద్ద నుంచి వెళ్లి పోయారు. రైతులు రంజిత్‌రెడ్డి, రంగు రమేష్, పాలబోయిన జోగులు, బాలరాజు, రాందాసు, మునిపల్లి ప్రభాకర్, నామాల మల్లేషం, పుల్యాల నారాయణరెడ్డి, మల్లారెడ్డి, పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

జఫర్‌గఢ్: నిరుపేదలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. మండలంలోని మగ్దుంతండాకు చెందిన బానోత్ గన్యకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.50 వేల ఎల్‌ఓసీని హనుమకొండలోని తన నివాసంలో శ్రీహరి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్ రావు, గుజ్జరి రాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తాం

పాలకుర్తి టౌన్/ పాలకుర్తి: పాలకుర్తి నియోజకవర్గంలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ స్వరూప, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సంధ్య, ప్రశాంతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడుసత్యనారాయణ, మండల అధ్యక్షుడు కుమారస్వామి ఉన్నారు.

క్యాంపు కార్యాలయం పరిశీలన

నియోజకవర్గంలోని క్యాంపు కార్యాలయాన్ని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కార్యాలయంలో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని వారు అధికారులను ఆదేశించారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రుణమాఫీపై సందేహాలను నివృత్తి చేసుకోండి



రికార్డులు పరిశీలించిన ఏడీఏ పరశురామ్

దేవరుప్పుల: మండలంలోని ఆయా రైతు వేదికల్లో పంట రుణమాఫీ ప్రక్రియపై సందేహాలను రైతులు నివృత్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ పాలకుర్తి ఏడీఏ పరశురామ్ సూచించారు. శుక్రవారం మండలంలోని కడవెండి రైతు వేదికను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ. లక్ష రుణమాఫీ లబ్ధిదారులు విధిగా ఆయా బ్యాంకులకు వెళ్లి తగు ధ్రువీకరణ పత్రాలతో రెన్యువల్ చేసుకోవాలన్నారు. రుణమాఫీ జాబితాలో తప్పులు దొర్లితే తమ దృష్టికి తెస్తే సంబంధిత బ్యాంకర్లతో సమీక్షించి తగు న్యాయం చేసేందుకు తోడ్పాటు అందిస్తామన్నారు. ఇటీవల భూమి పట్టాదారు పుస్తకం పొందిన రైతులు రూ.5 లక్షల బీమా కోసం బ్యాంకు, ఆధార్, నామిని ఆధార్ జిరాక్స్ ప్రతులతో రైతు వేదికల్లో ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సంతోష్, రైతులు ఆవుల రాములు, కత్తుల సుధాకర్, భాషిపాక కొమురయ్య, కుమార్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యానిలయాల పురోగతికి పాటుపడండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

దేవరుప్పుల: ఓనమాలు నేర్పే విద్యాలయాల పురోగతికి ప్రతీ ఒక్కరు పాటుపడాలని అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. సింగరాజుపల్లిలో గతేడాది కలెక్టర్ ప్రత్యేక నిధులు రూ.2 లక్షలతో చేపట్టిన అంగన్‌వాడీ ఆదర్శ కేంద్ర నిర్మాణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. చిన్నారులను ఆకర్షించేలా ఆహ్లాదకరమైన వాతావరణంతో కూడిన ఈ కేంద్రాన్ని ఆదర్శంగా తీసుకొని జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పనులు చేపట్టిన మాజీ వైస్‌ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ జిల్లా అధికారి జయంతి, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంపీఓ టి.సురేష్‌కుమార్, పీఆర్ డీఈ రామలింగాచారి, ఏఈ మానస, మాజీ సర్పంచ్ మల్లేషం, అంగన్‌వాడీ టీచర్ రేణుక పాల్గొన్నారు.

‘కేసీఆర్‌ది ఊహల బడ్జెట్.. కాంగ్రెస్‌ది వాస్తవ బడ్జెట్’



రాజిరెడ్డి

జనగామ: ప్రత్యేక రాష్ట్రంలో నాటి కేసీఆర్ బడ్జెట్ ఊహల్లో తేలియాడగా, ప్రస్తుతం అధికార కాంగ్రెస్ ప్రవేశపెట్టిన బడ్జెట్ వాస్తవాలకు దగ్గరగా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి మొగుళ్ళ రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఊహలకు, వాస్తవానికి చాలా తేడా ఉంటుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బడ్జెట్‌ను ప్రజలు హర్షిస్తున్నారన్నారు. హామీల అమలుపై జనంలోకి రావడానికి మంత్రులు ఉత్తమ్, భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరావు, పొన్నం ప్రభాకర్, సిద్ధంగా ఉన్నారని, అటు నుంచి కేసీఆర్, కేటీఆర్ సిద్ధమా అని సవాల్ విసిరారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఆరు గ్యారెంటీలను విజయ వంతంగా అమలు చేసేందుకు సరిపడా బడ్జెట్ కేటాయించినట్లు వివరించారు. వ్యవసాయరంగానికి రూ.72 వేల కోట్లు కేటాయించి కాంగ్రెస్ మరోసారి రైతు ప్రభుత్వం అని నిరూపించుకుందన్నారు. కేసీఆర్ హయాంలో అప్పులకు ప్రాధాన్యత ఇస్తే, సీఎం, భట్టి అభివృద్ధికి పట్టం కట్టారన్నారు. ప్రజాపాలన సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని బీఆర్‌ఎస్ నేతలను హెచ్చరించారు.

‘విద్యారంగానికి తీవ్ర అన్యాయం’

జనగామ రూరల్: ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం అన్నారు. పట్టణంలో శుక్రవారం సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బడ్జెట్ కంటే తక్కువ నిధులు కేటాయించిన ప్రభుత్వం.. విద్యారంగాన్ని ఎలా అభివృద్ధి చేస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 800 గురుకులాలకు సొంత భవనాలు లేవని, పాఠశాలల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. మధ్యాహ్న భోజన నిధులు, నూతన భవనాలు, లైబ్రరీలు, మౌలిక వసతులు కల్పన ఎలా చేస్తారని ప్రశ్నించారు. నియోజకవర్గాల కేంద్రంలో డిగ్రీ కళాశాలల ఊసేలేదని విమర్శించారు. తక్షణమే బడ్జెట్ సవరించి విద్యారంగానికి అధిక ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు సందీప్, రాజేష్, ఆర్య, రాజు, అరున్, శ్రీలత పాల్గొన్నారు.



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

16వ వార్డులో డ్రై డే

జనగామ: పట్టణంలోని 16వ వార్డులో శుక్రవారం డ్రైడేను పురస్కరించుకుని కౌన్సిలర్ గాదెపాక రాంచందర్ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిశుభ్రత, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పూలతొటలు, కొబ్బరి చిప్పలు, విరిగిపోయిన కులాయిల్లో నీటి నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడూ శుభ్రం చేసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రంతో దోమలను నివారించి, మలేరియా, డెంగీ వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. తడి, పొడిచెత్తను వేరు చేసి ఆరుబయట వేయకుండా, చెత్త వాహనం వచ్చిన సమయంలో అందులో వేయాలని సూచించారు. మున్సిపల్ అధికారి ఉడుగుల సురేందర్, ఆర్‌పీ ప్రశాంతి, అంగన్‌వాడీ టీచర్ జయ, గొంగల్ల సుజాత, వార్డు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వకుండా చూడాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో ఇంటి చుట్టు, వీధుల్లో, పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని ప్రజలకు పంచాయతీ కార్యదర్శులు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో డ్రైడేను సందర్భంగా పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. వీధుల్లో తిరిగి ఖాళీ కుండలు, డమ్ముల్లో నీటిని పారబోయించారు.



జనగామ: డ్రమ్ములోని నీటిని పారబోయిస్తున్న మున్సిపల్ అధికారులు



బచ్చన్నపేటలో..

శారీరక శ్రమతో రోగాలనుంచి రక్షణ

దేవరుప్పుల: ప్రతి రోగ నివారణకు మందులు ఏకైక మార్గంగా యోచించకుండా కనీస శారీరక శ్రమ కలిగించినప్పుడే పలు రోగాల నుంచి రక్షించుకోవచ్చని నిమ్స్ ఫిజియోథెరపిస్టు వెంకటరమణ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఎంఈఓ కళావతి అధ్యక్షతన నిజాం ఫిజియోథెరపీ ఇన్స్టిట్యూట్ హైదరాబాద్ వారి సౌజన్యంతో ప్రధానోపాధ్యాయులకు ఫిజియోథెరపీపై విస్తృత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగ విధుల్లో మానసిక ఒత్తిడికి లోనవుతున్న తరుణంలో అప్రమత్త చర్యలు చేపట్టాలని అన్నారు. ఫిజియోథెరపీ ద్వారా నరాలు, కండరాల బలహీనత తొలిగిపోయేందుకు వ్యాయామ పద్ధతులను అవలంబించాలన్నారు. మండల నోడల్ అధికారిణి కళావతి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రాజేందర్ కుమార్, ప్రధానోపాధ్యాయులు యు శ్రీనివాస్, శివాజీ, సుచిత్ర ఆనంద్, నల్ల లలిత, అంబటి అంజయ్య, బుర్ర రమేష్, రాము, ఉమారాణి, వెంకన్న, మాధవిలత, ప్రవీణ్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హె చ్‌ఎంలకు అవగాహన కల్పిస్తున్న వెంకటరమణ

కుక్కల బెడదను నివారించాలి



జనగామ: పట్టణంలో కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. కుక్కలను ఏబీసీ సెంటర్‌కు తరలించి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, దోమల నివారణపై దృష్టి పెట్టాలని కోరారు. అనంతరం మేనేజర్ రాములు, ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లిగారి మధు, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ప్రతినిధులు కొయ్యడ రవి, బింగి నరసింహులు, లకన్ సింగ్‌తో కమిషనర్ మాట్లాడారు.

కార్గిల్ వీరులకు ఘన నివాళి

జఫర్‌గఢ్: కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి కార్గిల్ వీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో వీర మరణం పొందిన సైనికుల త్యాగాలు మరువలేనివన్నారు. ఎదులాపూరం మదన్‌మోహన్, సింగారపు రమేష్, పందిబోయిన రాజు, పల్లా దయాకర్, సాయిరాం, మచ్చ బాబు, పిట్ట రాజు, చందరాజు, పల్లె సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో..

మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా కార్గిల్ విజయ్ దివాస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులను స్మరించుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

త్రికూటాలయాన్ని పునర్నిర్మించాలి



నినాదాలు చేస్తున్న విద్యార్థులు

రఘునాథపల్లి: రామప్ప, వేయిస్తంభాల గుడి తరహాల్లో కళాత్మక నిర్మాణాలున్న మండలంలోని నిడిగొండ ముక్తేశ్వరాయాలన్ని (త్రికూటాలయం) పునర్నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరారు. శిక్షాసప్తాహంలో భాగంగా శుక్రవారం మండలంలోని నిడిగొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి గ్రామంలోని చారిత్రక ప్రదేశాలను సందర్శించారు. చాళుక్యులు, కాకతీయులు, నతవాడి రాజుల వైభవాన్ని తెలిపే నిర్మాణాలు, శాసనాలను చూపిస్తూ, అయా కట్టడాల చారిత్రక నేపథ్యాన్ని లక్ష్మీనృసింహస్వామి ఆలయ వేదపండితులు కృష్ణమాచార్యులు విద్యార్థులకు తెలియజేశారు. వేయి స్థంభాల గుడి తరహాలో కాకతీయుల కళా ప్రభావానికి ప్రతీకగా నిలిచిన 500 స్తంభాల త్రికూటాలయం కాలగమనంలో శిథిలమవుతున్నందున ఆలయాన్ని పునర్నిర్మించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరముందని ఆ దిశగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయులు శ్యాంకుమార్, నాగరాజు, కవిత, సరోజనదేవి, విజయ, వసంత, విద్యార్థులు పాల్గొన్నారు.

‘విద్యారంగంపై నిర్లక్ష్యం’

జనగామ రూరల్: బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుందని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి అన్నారు. పట్టణంలోని ఉన్నత పాఠశాలలో జిల్లా అధ్యక్షుడు బి.చొక్కయ్య అధ్యక్షత నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దివాకర్ రెడ్డి, షరీఫ్, దూదయ్య, యాదయ్య, డి శ్రీనివాస్, ఆంజనేయులు, శ్రీనివాస్, అప్సర్ పాల్గొన్నారు.

గుట్కాల స్వాధీనం

లింగాలఘణపురం: మండలంలోని చీటూరులో మల్కాపురంలో రవి కిరాణం యజమాని, జనగామకు చెందిన విక్రమ్‌సింగ్ వద్ద రూ.25వేల విలువైన గుట్కాలను స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చింత రాజు తెలిపారు. చీటూరులో గుట్కాలు విక్రయిస్తున్నారనే పక్కా సమాచారంతో శుక్రవారం తనిఖీలు చేయగా మల్కాపురం రవి వద్ద కొన్ని లభించగా ఎక్కడి నుంచి వస్తున్నాయని ప్రశ్నించగా జనగామకు చెందిన విక్రమ్‌సింగ్ సరఫరా చేస్తున్నాడని తెలుపడంతో అతని ఇంట్లో తనిఖీ చేయగా గుట్కాలు లభించాయని దీంతో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వెంకటాయపాలెంలో..

రఘునాథపల్లి: మండలంలోని అశ్వరావుపల్లి శివారు వెంకటాయపాలెం జాతీయ రహదారిలోని కిరాణం షాపులో శుక్రవారం పోలీసులు తనిఖీ చేసి నిషేధిత గుట్కాను పట్టుకున్నారు. నూనెముంతల సరిత కిరాణం షాపులో అక్రమంగా గుట్కా నిల్వ చేసి విక్రయిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గుట్కా విలువ రూ 1,500 ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎస్సై దూదిమెట్ల నరేష్ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంక్షిప్త సమాచారం

మేకల దొంగల అరెస్టు

జనగామ రూరల్: పట్టణంలో మేకల చోరీకి పాల్పడిన దొంగలను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ రఘుపతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్‌నగర్‌కు చెందిన గూడెపు మహేశ్వరి, పిట్టల జంపన్నల మేకపోతులను దొంగలు చోరీ చేశారు. కాగా వాటిని శాయంపేట మండలం కాట్రపల్లికి చెందిన మిర్యాల చిన్న నర్సయ్య, మిరి యాల సురేష్‌లు నవాబుపేట అంగడిలో విక్రయించి ఆటోలో వస్తుండగా ఎస్సై భరత్ వాహనాల తనిఖీలో భాగంగా పట్టుకున్నారు. మేకలు విక్రయించిన డబ్బులు రూ. 21వేలను రికవరీ చేసి ఆటోను సీజ్ చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్థికసాయం

స్టేషన్‌ఘన్‌పూర్: నమిలిగొండ గ్రామానికి చెందిన గాదె ఆటోనాగేష్ భార్య గాదె రమ్య అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతిచెందింది. కాగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పురమాని ఐలోనియాదవ్ శుక్రవారం బాధిత కుటుంబానికి రూ.10వేల సాయం అందజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించండి

కొడకండ్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇద్దరి కంటే ఎక్కువ సంతానం కలిగిన వారు పోటీ చేసే అవకాశాన్ని కల్పించాలని జీసీసీ మాజీ చైర్మన్ అభిమన్‌గాంధీనాయక్ కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు.

మహాసభను జయప్రదం చేయండి

తరిగొప్పుల: ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవం పురస్కరించుకుని సేవాలాల్ సేన త్రిసభ్య కమిటీ ఆదేశానుసారం ఆగస్టు 9వ తేదీన సరూర్‌నగర్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో నిర్వహించే రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సేన మండల అధ్యక్షుడు సభావత్ అల్వతి నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకేంద్రంలో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు.

బడ్జెట్‌లో అన్ని రంగాలకు సమ న్యాయం

బచ్చన్నపేట: సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులో అన్ని రంగాలకు సమ న్యాయం చేశారని కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. రైతులకు పంట రుణాలను మాఫీ చేసి సీఎం రైతు పక్షపాతి అయ్యాడన్నారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పిన్నింటి నారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాద స్థలం పరిశీలన

కొడకండ్ల: ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాద స్థలాన్ని శుక్రవారం పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి పరిశీలించారు. రంగాపురం క్రాస్‌రోడ్డు వద్ద జరిగిన సంఘటనలో సూర్యాపేట జిల్లా బండ్లపల్లికి చెందిన సాయికిరణ్ మృతి చెందగా జాజిరెడ్డిగూడేనికి చెందిన జశ్వంత్ గాయపడిన నేపథ్యంలో ప్రమాద స్థలానికి సీఐ వచ్చి సంఘటన జరిగిన తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రమాదాల నివారణ కోసం కృషి చేస్తామని సీఐ తెలిపారు.

రైతులు ఆందోళన చెందొద్దు

జఫర్‌గఢ్: రుణమాఫీ కాలేదని రైతులు ఆందోళన చెందవద్దని తహసీల్దార్ హరిప్రసాద్ అన్నారు. మండలంలోని ఏపీజీవీబీ బ్యాంకును ఆయన సదర్శించి అధికారులతో మాట్లాడారు. రుణ మాఫీ అయిన డబ్బులను బ్యాంకు అధికారులు ఇతర ఖాతాలకు ముడిపెట్టకుండా రైతులకు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రధానమంత్రి దిష్టిబొమ్మ దహనం



నర్మెట: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



బచ్చన్నపేటలో..

నర్మెట/తరిగొప్పుల/బచ్చన్నపేట/పాలకుర్తి/కొడకండ్ల: బడ్జెట్ కేటాయింపుల్లో కేంద్రప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని కాంగ్రెస్, దాని అనుబంధ సంఘాల శ్రేణులు పలు మండల కేంద్రాల్లో శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీదిష్టి బొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దిష్టిబొమ్మను ఊరేగిస్తూ కేంద్ర ప్రభుత్వానికి, మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు రాజబోయిన లక్ష్మీనారాయణ, ప్రజాపురం శ్రీధర్, పండుగ కనకయ్య, మంద చంద్రయ్య, పింగిళి ఇంద్రారెడ్డి, రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, ధరావత్ సురేష్‌నాయక్, రాజేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

‘హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం’

స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన హామీలను తుంగలో తొక్కిందని, రాష్ట్ర బడ్జెట్‌లో అంకెలగారడీ, అభూతకల్పన తప్ప ఒరిగిందేమీ లేదని బీజేపీ నేత, మాజీ మంత్రి డాక్టర్ గుండె విజయరామారావు అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏమాత్రం ఆశాజనకంగా లేదని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేయడంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండూరెండే అన్నారు. ప్రభుత్వానికి పేదలపై చిత్తశుద్ధి ఉంటే ముందుగా అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్‌కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సట్ల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి బూర్ల విష్ణు పాల్గొన్నారు.